క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మీర్‌పేట: పలు ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందునా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని లెనిన్‌నగర్ సబ్‌స్టేషన్ ఏఈ సీహెచ్ నాగిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ విరాట్‌నగర్ ఫీడర్ పరిధిలోని బీజేపీ క్వార్టర్స్, సాయి గణేష్‌నగర్, సాయి సామ్రాట్‌నగర్, పోష్‌కాలనీ, విరాట్‌నగర్, న్యూ మారుతినగర్, గ్రీన్ ఎస్టేట్, లక్ష్మీ ఎన్‌క్లేవ్ ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం1 గంట వరకు 11కేవీ లెనిన్‌నగర్ ఫీడర్ పరిధిలోని త్రివేణినగర్, ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ కాలనీల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు దీన్ని గమనించాలని ఆయన కోరారు.

హుడాకాంప్లెక్స్‌లో..

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ భగత్‌సింగ్‌నగర్, వెంకటరమణ కాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, 11కేవీ పోస్టాఫీస్, చిత్రలేఅవుట్, యాదవనగర్, ఖిల్లామైసమ్మ దేవాలయం ఫీడర్ల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ లింగోజిగూడ, సరూర్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

పేద విద్యార్థులకు డిగ్రీలో ఉచిత విద్య

బడంగ్‌పేట్: బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధి బాలాపూర్‌లోని బద్దం భూపాల్‌రెడ్డి డిగ్రీ కళాశాలలో పేద విద్యార్థులకు డిగ్రీలో ఉచిత విద్యను అందిస్తున్నారు. బాలాపూర్ మండల కేంద్రలోని హోలీ మదర్ పీజీ కళాశాల వ్యవస్థాపకులు డాక్టర్ బద్దం భూపాల్‌రెడ్డి జ్ఞాపకార్థం, బద్దం భూపాల్‌రెడ్డి డిగ్రీ కాలేజీలో 2023–24 విద్యా సంవత్సరానికిగాను బీకాం (కంప్యూటర్స్), బీబీఏ కోర్సుల్లో ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు డిగ్రీలో ఉచిత విద్యను అందిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ సునితా భూపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులు దోస్త్ కోడ్ 11219 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఇంటింటా పూల మొక్కల పంపిణీ

కౌన్సిలర్ రవినాయక్



మొక్కలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: హరితహారంలో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలని కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ సూచించారు. మున్సిపాలిటీ కేంద్రంలోని 10వ వార్డులో మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హరితహారంలో భాగంగా బుధవారం ఇంటింటా పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పలుగ్రామాల్లో పంటల పరిశీలన

ఆమనగల్లు: పంటలో చీడపీడల నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి అరుణకుమారి సూచించారు. ఆమనగల్లు మండలం చింతలపల్లి, మంగళపల్లి, మేడిగడ్డతండాల్లో రైతులు సాగుచేసిన వరి, మొక్కజొన్న, పత్తి, జొన్న, కంది పంటలను బుధవారం ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వరిలో జింక్‌లోపం నివారణకు లీటర్ నీటిలో జింక్ సల్ఫేట్ 2 గ్రాములు కలిపి పిచికారి చేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు పటేరా గుళికలను ఎకరాకు 4కిలోల ఇసుకలో కలిపి పొలంలోచల్లాలని ఆమె సూచించారు. రైతులు నారాయణరెడ్డి, లక్ష్మారెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత తప్పనిసరి

ఆదిభట్ల సీఐ రఘువీర్ రెడ్డి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

తుర్కయంజాల్: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదిభట్ల సీఐ రఘువీర్ రెడ్డి తెలిపారు. బుధవారం రాగన్నగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వి ద్యార్థులకు ఏర్పాటు చేసిన సైబర్ క్రైమ్‌పై అవగా హన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఫేస్ బుక్, ట్విట్టర్, సోషల్ మీడియా ఉపయోగించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అనవసరమైన లింక్‌లను ఓపెన్ చేయకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో కనీస వసతుల్లేవు..!

- శిథిలావస్థకు చేరిన డ్వాక్రా భవన్‌లో కొనసాగింపు
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందుల్లో గర్భిణులు, చిన్నారులు



మీర్‌పేట: శిథిలావస్థకు చేరిన డ్వాక్రా భవన్‌లో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రం

మీర్‌పేట: అంగన్‌వాడీలో కనీస వసతులు కరువయ్యాయి. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్ ఫేజ్–1లోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణిలు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. సొంత భవనం లేకపోవడంతో కొన్నేళ్లుగా డ్వాక్రా భవన్‌లోనే కొనసాగుతోంది. ఈ కేంద్రానికి మొత్తం గర్భిణులు, బాలింతలు కలిపి 25 మంది, మరో 20 మంది పిల్లలు వస్తుంటారు. వారు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరి లోపల పెచ్చులూడిపోవడంతో వర్షం పడినప్పుడల్లా కురుస్తుందని వారు తెలిపారు. అదే విధంగా టాయిలెట్స్ లేకపోవడంతో గర్భిణిలు ఇబ్బందులు పడుతున్నారని, చిన్న పిల్లలు కూడా మల, మూత్ర విసర్జనకు రోడ్డుపై వెళ్లాల్సి వస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు నీటి సౌకర్యం కూడా ఏర్పాటు చేయకపోవడంతో వారు తమతమ ఇళ్లకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నామని చిన్నారులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ కేంద్రాన్ని నూతన భవనంలోకి మార్చాలని పలువురు కోరుతున్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్, బడంగ్‌పేట్, నాదర్‌గుల్, అల్మాస్‌గూడ, వెంకటాపూర్, మల్లాపూర్, కుర్మల్‌గూడ, కమ్మగూడ, గుర్రంగూడ అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లలు అంతంతమాత్రమే వస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న గుడ్లు, పాలు, బాలామృతం, అన్నం అందిస్తున్నప్పటికీ సొంత భవానాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు పేర్కొన్నారు. కొన్ని చోట్ల నీటి కొరత తీవ్రంగా ఉంది. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒంటికి, రెంటికి చిన్నారులు పోయినప్పుడు నీళ్ల లేక ఇంటికి పంపించే దుస్థితి నెలకొంది. కొన్ని సెంటర్లు చాలా బాగా నడుస్తున్నా ఇబ్బందులు మాత్రం తప్పడంలేదని వారు చెబుతున్నారు.

పహాడీషరీఫ్‌లో..

పహాడీషరీఫ్: జల్‌పల్లి మునిసిపాలిటీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సదుపాయాలు కరువవ్వడంతో సిబ్బంది, చిన్నారులకు అసౌకర్యాలు తప్పడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని జల్‌పల్లి గ్రామం, శ్రీరాం కాలనీ, పహాడిషరీఫ్, వాదే ముస్తఫా, ఎర్రకుంట, షాహిన్‌నగర్, కొత్తపేటలోని కేంద్రాలలో విద్యుత్ సమస్య, మూత్రశాలలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జల్‌పల్లి గ్రామంలోని రెండో అంగన్‌వాడీ కేంద్రం భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో గర్భిణీలు, బాలింతలు, సిబ్బంది బిక్కుబిక్కుమంటున్నారు.

ప్రమాదకరంగా భవనం..

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ భగత్‌సింగ్‌నగర్ కాలనీలో 20 సంవత్సరాల క్రితం నిర్మించిన అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరి పెచ్చులూడుతోంది. భవనాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు మహిళలు చెబుతున్నారు. ఒకప్పుడు వందలాది మహిళలకు శిక్షణ కేంద్రంగా ఉన్న ఈ భవనం ఎంతో మంది మహిళల జీవితంలో వెలుగులు నింపింది. నిర్మించిన నాటి నుంచి నేటివరకు భవనంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో మొత్తం పగుళ్లు వచ్చి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు తలుపులు, కిటికీలు విరిగిపోయి ప్రహరీ ప్రమాదకరంగా మారింది. బుధవారం గేటు ప్రహరీ కూలిపోవడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.



బడంగ్‌పేట్: గాంధీనగర్‌లోని అంగన్‌వాడీలో చిన్నారులు



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో శిథిలావస్థకు చేరుకున్న భవనం

చెత్త వేస్తే సహించేది లేదు

- పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా
- ప్లాస్టిక్ రహిత కార్పొరేషన్‌గా మార్చేందుకు కృషి
- మీర్‌పేట మున్సిపల్ కమిషనర్ వాణి



మీర్‌పేట: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. వీధుల్లో, ప్రధాన రహదారులపై చెత్త వేస్తే సహించేది లేదు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారికి జరిమానాలు విధిస్తాం, ఇప్పటి వరకు కార్పొరేషన్‌లో 8 మందికి, నాణ్యతేని ఆహార పదార్థాలను విక్రయిస్తున్నట్లు గుర్తించి అయ్యంగార్ బేకరీ యజమానికి జరిమానా విధించామని మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అల్లూరి వాణి తెలిపారు. బుధవారం ఆమె 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

ప్రశ్న: పారిశుద్ధ్య నిర్వహణపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ప్రతిరోజు ఉదయం కాలనీలు, ప్రధాన రహదారులను ఆకస్మికంగా తనిఖీ చేసి చెత్తా చెదారం ఉంటే వెంటనే సిబ్బందితో తొలగిస్తున్నాం. చెత్త కనిపించకుండా ఎప్పటికప్పుడు తరలించేలా సిబ్బందిని ఆదేశించాం.

ప్రశ్న: అంటువ్యాధులు ప్రబలకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

జవాబు: వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని కాలనీలు, బస్తీల్లో అంటువ్యాధులు ప్రబలకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లుతున్నాం, దోమలను నివారించేందుకు సాయంత్రం వేళల్లో ఫాగింగ్ చేపడుతున్నాం. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందితో కలిసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: పరిశుభ్రతపై ప్రజలకు ఎలాంటి అవగాహన కల్పిస్తున్నారు?

జవాబు: చెత్త బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా ఇళ్ల వద్దకు వచ్చే ఆటోలో మాత్రమే వేయాలని ప్రజలకు వివరిస్తాం. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు క్లుప్తంగా వివరించి, చెత్త, ప్లాస్టిక్ రహిత కార్పొరేషన్‌గా మార్చేందుకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: వర్షాకాలంలో కార్పొరేషన్‌లో తీసుకుంటున్న చర్యలేవి?

జవాబు: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున సమస్య తలెత్తకుండా ముందస్తుగానే డ్రైనేజీ, మ్యాన్‌హోళ్లలో చెత్తా చెదారం, ప్లాస్టిక్ పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు సిబ్బందితో పూడిక తీయిస్తున్నాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా 24 గంటలు మాన్‌సూన్ బృందాలను అప్రమత్తంగా ఉంచాం.

మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్

విస్తీర్ణం	6.70 కి.మీ
జనాభా	1,12,904
మొత్తం కాలనీలు	130
మొత్తం వార్డులు	46
శానిటేషన్ సిబ్బంది సంఖ్య	131
చెత్త సేకరణ ఆటోలు	46
చెత్త తరలించే ట్రాక్టర్లు	5
అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు	70.50 కి.మీ

ఉద్యమకారులకు అండగా ఉంటా

మంత్రి సబితారెడ్డి



పహాడీషరీఫ్: మంత్రికి చిత్రపటాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్‌వీ నాయకులు

పహాడీషరీఫ్: తెలంగాణ ఉద్యమకారులకు అన్ని రకాల అండగా ఉంటామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి భరోసా ఇచ్చారు. బీఆర్ఎస్‌వీ విభాగం నాయకులు మంత్రిని కలిసి ఆమె చిత్ర పటాన్ని మెమెంటోగా అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉద్యమ సమయంలో పోరాడిన ప్రతి ఒక్కరిని బీఆర్ఎస్ గుండెల్లో పెట్టుకొని చూసుకుంటుందన్నారు. మంత్రిని కలిసిన వారిలో నియోజకవర్గం బీఆర్ఎస్‌వీ అధ్యక్షుడు దయానంద్ ముదిరాజ్, జల్‌పల్లి మున్సిపాలిటీ అధ్యక్షుడు సయ్యద్ ఫెరోజ్, నాయకులు వెంకటేష్, యాదగిరి, నర్సింహా, షకూర్, ధీరజ్‌రెడ్డి పాల్గొన్నారు.

నాలాల అభివృద్ధికి చర్యలు

మీర్‌పేట: నాలాల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. బుధవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో నాలాల అభివృద్ధిపై రెండోరోజు అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలోని మీర్‌పేట, బడంగ్‌పేట, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీల్లో వరదనీరు సాఫీగా వెళ్లేలా రెండో విడతలో చేపట్టే నాలాల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్ సహకారంతో మొదటి విడతలో ఇప్పటికే రూ.110 కోట్లతో చేపడుతున్న నాలాలతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్లు తీగల విక్రంరెడ్డి, ఇబ్రాం శేఖర్, మున్సిపల్ ఛైర్మన్ అబ్దుల్లా సాధి, కమిషనర్‌లు అల్లూరి వాణి, సుమన్‌రావు, వసంత, ఎస్ఎన్‌డీపీ, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'మహేశ్వరం బరిలో నిలుస్తాం'



సమావేశంలో మాట్లాడుతున్న సుజాత

బడంగ్‌పేట్: మహేశ్వరం నుంచి బరిలో ఎంసీపీఐయూ అభ్యర్థిని పోటీలో నిలబెడుతామని ఎంసీపీఐయూ జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత పేర్కొన్నారు. కుర్మల్‌గూడలోని ఎంసీపీఐయూ పార్టీ కార్యాలయంలో బుధవారం అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సమైక్య రంగారెడ్డి జిల్లా కమిటీ జనరల్ బాడీ సమావేశం జిల్లా ఉపాధ్యక్షురాలు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ బలపరిచిన ఎంసీపీఐయూ అభ్యర్థి బొద్రమోని పురుషోత్తంను బరిలో దింపుతున్నట్లు సుజత ప్రకటించారు. నేటి నుంచి నామినేషన్ వేసే వరకు ప్రతి పల్లెకు, పట్టణానికి గ్రామ శాఖలను, మండల కమిటీలను, బూత్ కమిటీలను నియమిస్తామన్నారు. 35 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీ ఎజెండానే నమ్ముకుని ముందుకు సాగుతున్న బొద్రమోని పురుషోత్తంకు అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం. స్వరూప, సిహెచ్.రాజు, జి.కృష్ణ, వీరస్వామి, జగదాంబ పాల్గొన్నారు.

మంత్రి సబితను కలిసిన జీపీ కార్మికులు



జీపీ కార్మికులతో మాట్లాడుతున్న సబితారెడ్డి

మహేశ్వరం: గ్రామ పంచాయతీ కార్మికులు మంత్రి సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. గ్రామ పంచాయతీ కార్మికులు రాష్ట్ర వ్యాప్తంగా 28 రోజులగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం స్పందించడం లేదని కార్మికులు మంత్రి ఎదుట వాపోయారు. జీఓ నంబర్ 60 ప్రకారం కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

జీపీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

అన్నోజిగూడ గ్రామంలో రూ.20 లక్షల నిధులతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి తీగల అనితారెడ్డితో కలిసి మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. కొత్తూరు గ్రామంలో పేదలకు సర్వే నంబర్ 210లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, కొత్తూరు గేటు నుంచి గఫూర్ నగర్ వరకు రోడ్డు వెడల్పు చేయాలని గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించాలని సర్పంచ్ వసంత, మాజీ వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్, వార్డు సభ్యులు మంత్రికి వినతి పత్రం అందజేశారు.

విభేదాలు లేకుండా సమన్వయం చేయాలి

ఆమనగల్లు: కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్‌లో విభేదాలు, గ్రూపులు లేకుండా సమన్వయం చేయాలని రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, కల్వకుర్తి అసెంబ్లీ నియోజక వర్గ నాయకులు ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని కోరారు. ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యేను వివిధ మండలాల అధ్యక్షులు పరమేశ్, జైపాల్‌రెడ్డి, పాసుగోటి అర్జున్‌రావ్, శంకర్, భూపతిరెడ్డి, ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్ ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, కల్వకుర్తి మా ర్కెట్‌చైర్మన్ విజయ్‌గౌడ్, దోనాదుల కుమార్, వెంకట్‌రెడ్డి, వడ్డె వెంకటేశ్, లాలయ్యగౌడ్, గుమ్మకొండ రాజు, చుక్క నిరంజన్‌గౌడ్ తదితరులు ఎమ్మెల్యేకు విన్నవించారు.

ఉత్తరాల్లో పిన్‌కోడ్ రాయాలి

రాయపోల్ సబ్‌పోస్ట్ మాస్టర్ జంగయ్య

ఇబ్రహీంపట్నం రూరల్: పిన్‌కోడ్ నెంబరు కరెక్టుగా రాస్తేనే సకాలంలో ఉత్తరాలు అందుతాయని రాయపోల్ సబ్‌పోస్ట్‌మాస్టర్ జె. జంగయ్య పేర్కొన్నారు. రాయపోల్ పోస్టాఫీస్ పరిధిలో 501508 పిన్‌కోడ్ నెంబరు ఉపయోగించాలని, ప్రజలు దీనిపై అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఆరుట్ల, దండుమైలారం, జపాల్, లింగంపల్లి, పోల్కంపల్లి, మంచాల్, రంగాపూర్, తాళ్లపల్లిగూడ గ్రామాల ప్రజలు తప్పని సరైన పిన్‌కోడ్ నెంబరుతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలని సూచించారు.

ఇళ్ల నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చేయూత

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం కోనాపూర్ గ్రామంలో నిరుపేద ఇంటి నిర్మాణానికి ఉప్పల ట్రస్టు చేయూతనందించింది. గ్రామానికి చెందిన కంబాలపల్లి ఈశ్వరమ్మ, నర్రపెద్దమ్మల ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం ఇంటి నిర్మాణానికి మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, కృష్ణ, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, చంద్రకాంత్ పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణానికి చేయూత

తలకొండపల్లి: నిరుపేదల ఇళ్ల నిర్మాణాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూతనందించాడు. మండల పరిధిలోని చీపునుంతలకు చెందిన యాదమ్మ, మల్లేష్‌ల నూతన ఇంటి నిర్మాణాలకు బుధవారం సిమెంట్, స్టీల్, కాంక్రీట్, ఇటుక, తదితర మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రఘుపతి, తదితరులున్నారు.

భూ బాధితులకు బీజేపీ అండగా ఉంటుంది



మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

బడంగ్‌పేట్: భూబాధితులకు న్యాయం జరిగే వరకు బీజేపీ అండగా ఉంటుందని ఆ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2012లో సర్వేనెంబర్–2లో బడంగ్‌పేట దళితుల ఇండ్ల స్థలాల కోసం 5 ఎకరాలు కేటాయిస్తే అందులో చాలా ప్లాట్లు దళితులకు ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ప్రస్తుతం దళితుల భూమిని ప్రజాప్రయోజనార్థం ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలకు కేటాయించడం సంతోషకరమేనన్నారు. కానీ మిగిలిన భూమిని ఇండ్లు లేని దళితులకు కేటాయించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఇంద్రసేనా, శ్రీధర్ రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, చిత్రం శ్రీను, రామకృష్ణారెడ్డి, అజయ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు చేరిన దీక్షా..

బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని దావుత్‌ఖాన్‌గూడలో సర్వేనెంబర్–2లో భూబాధితుల కుటుంబాలు బుధవారం కూడా దీక్ష చేశారు. బడంగ్‌పేట నుంచి నాదర్‌గుల్ వెళ్లే ప్రధాన దారిలో బాధితులు, మహిళలు పిల్లలతో కలిసి వంటావార్పు చేశారు. ఇప్పటికైనా విద్యాశాఖమంత్రి 120 గజాల చొప్పున పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కె.గోవర్ధన్‌యాదవ్



ఆమనగల్లు కస్తూర్బా విద్యాలయంలో సభ్యత్వం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌యాదవ్

ఆమనగల్లు: ప్రభుత్వం ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు కె.గోవర్ధన్‌యాదవ్ డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల పరిధిలోని ఆకుతోటపల్లి, ఆమనగల్లు బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన పీఆర్‌టీయు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో గోవర్ధన్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ఉద్యోగులు, ఉపాధ్యాయుల కోసం పీఆర్‌సీ కమిషన్ వేయాలని, మధ్యంతర భృతి ప్రకటించాలని ఆయన కోరారు. పీఈటీ, పండిత్ పోస్టులు అప్‌గ్రేడేషన్, 317 జీఓ ద్వారా ఇబ్బంది పడ్డ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి చంద్రం, పద్మజారాణి, వెంకటేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నర్సిహ్మా



మాట్లాడుతున్న కావలి నర్సిహ్మా

ఇబ్రహీంపట్నం: పేదలకు ఇల్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కావలి నర్సిహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో బుధవారం ఇబ్రహీంపట్నం మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇండ్లులేని నిరుపేదలు కొన్నేళ్లుగా ఇండ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నా ప్రభుత్వం స్పందించడంలేదన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలు ఇండ్లు కూలిపోయి పలువురు నిరాశ్రయులైనట్లు తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించకపోతే ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో లక్ష్మయ్య, నీలమ్మ, కృష్ణ, ములుగు నర్సింహ్మా పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందులు రానివ్వం

వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి

ఆమనగల్లు: మంగళపల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తామని మండల వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి చెప్పారు. గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం జక్కు అనంతరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. మన ఊరు.. మన బడి క్రింద వచ్చిన నిధులతో అదనపు తరగతి గదులు నిర్మించినట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మురళి, వెంకటేశ్, యాదయ్య, తానయ్య తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తా

చిగురింత పారిజాత రెడ్డి



మహేశ్వరం: శుభాకాంక్షలు తెలియజేస్తున్న మహేశ్వరం కాంగ్రెస్ నాయకులు



జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి

మహేశ్వరం: బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత జన్మదినం సందర్భంగా మహేశ్వరం, కందుకూరు మండలాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆమె నివాసానికి తరలి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో కాంగ్రెస్ పూర్వవైభవం తీసుకొచ్చి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని పారిజాతరెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై, మంత్రి సబితాఇందారెడ్డి చేస్తున్న అరాచకాలపై నిత్యం పోరాడుతామన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో మహేశ్వరం కాంగ్రెస్ అధ్యక్షుడు కాకి ఈశ్వర్, మాజీ మండల అధ్యక్షుడు కావలి దశరథ, నాయకులు నందిగామ నర్సింహా, రాజు నాయక్, అఫ్జల్ భేగ్, ఖాజా మొయినొద్దీన్, గొల్లూరు రాజు, మంత్రి బాల్‌రాజ్, రాజేందర్, ఒగ్గు శ్రీకాంత్, శశికాంత్ నాయక్, ప్రసాద్, ప్రవీణ్, శివ యాదవ్, శివ, షరీఫ్, రాజు, నర్సింహా, రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా జన్మదిన వేడుకలు

బడంగ్‌పేట్: బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ మేయర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చిగురింత పారిజాత నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలను మల్లాపూర్‌లో కాంగ్రెస్ కార్యాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. కందుకూర్, తుక్కుగూడ, జల్‌పల్లి మునిసిపాలిటీలు, మీర్‌పేట్, బడంగ్‌పేట కార్పొరేషన్లు, ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ల నుంచి పెద్ద ఎత్తున అభిమానులు, నాయకులు, మహిళలు, తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు.